చంద్రన్నా.. పేదలకు బీమా ఏదన్నా!

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ పథకం అమలు
- కూటమి ప్రభుత్వం పథకాన్ని నీరుగారుస్తున్న వైనం
- ఏడాది గడచినా స్వీకరించని దరఖాస్తులు

కొల్లిపర: పేద కుటుంబాల్లో కుటుంబ పెద్ద అకాలంగా మరణిస్తే ఇంటిల్లిపాది రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అలాంటి సమయంలో అండగా నిలుస్తున్న ఏకైక పథకం వైఎస్సార్ బీమా పథకం. అలాంటి పథకానికి ప్రస్తుత కూటమి ప్రభుత్వం తిలోదకాలు వదులుతోంది. అధికారంలోకి వచ్చి 14 నెలలు అయినా.. కనీసం సంబంధిత దరఖాస్తులు కూడా స్వీకరించడం లేదు. దీంతో పేదలకు చంద్రన్న బీమా పథకం అందని ద్రాక్షలా మిగిలిపోతోందని.. ఆ కుటుంబాలకు కూటమి ప్రభుత్వం బీమా ఇవ్వలేకపోతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం

మాయసేసి.. మోసగించి..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ బీమా పథకాన్ని చంద్రన్న బీమాగా పేరు మార్చారు. కుటుంబ పెద్ద సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.10 లక్షలు అందజేస్తామని ఎన్నికల ప్రచారంలో హామీని ఇచ్చి ప్రజలను మభ్య పెట్టారు. అధికారం చేపట్టిన తర్వాత పేద కుటుంబాలకు కూటమి ప్రభుత్వం మొండిచెయ్యి చూపించి నిలువునా మోసం చేసింది.

వెబ్‌సైట్ తొలగించి..

కూటమి ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకానికి సంబంధించిన ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ను తొలగించింది. అధికారం చేపట్టిన తర్వాత చంద్రన్న బీమా పథకంగా పేరు మార్చి పథకం గురించి అవగాహన పెంచకుండా, దరఖాస్తులు స్వీకరించకుండా మౌనంగా ఉండిపోయింది.

వెంటనే బీమా మంజూరు చేయాలి..

ఇంట్లో కుటుంబ సభ్యుడు, యజమానిని కోల్పోయిన మృతుల కుటుంబాలకు ఇచ్చిన హామీ మేరకు బీమా సొమ్మును వెంటనే మంజూరు చేయాలి. పలు గ్రామాల్లో పలు కుటుంబాలు యజమానిని, కుటుంబ సభ్యులను కోల్పోయి ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి కుటుంబాలకు ప్రభుత్వం గత ప్రభుత్వాలు అందించిన విధంగా బీమా సొమ్ము అందజేసి అండగా నిలవాలి.

– బి.మోహన్‌రెడ్డి, రైతు, వల్లభాపురం,

జగనన్న పాలనలో అమలు ఇలా..

గత వైఎస్సార్ సీపీ హయాంలో పేద బడుగు, బలహీన వర్గాల కుటుంబాల్లో 18 నుంచి 50 ఏళ్లలోపు వారు.. 50 నుంచి 60 ఏళ్లలోపు వారు మృతి చెందితే రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షల వరకు బీమా సొమ్ము మంజూరయ్యేది. మృతి చెందిన వెంటనే వలంటీర్లు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది మృతుడి ఇంటికి వెళ్లి మట్టి ఖర్చుల నిమిత్తం తక్షణ సాయంగా రూ.10 వేలు అందించేవారు. మిగతా సొమ్ము 15 నుంచి 20 రోజుల్లో నామిని బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమయ్యేది. ఈ బీమా ప్రీమియాన్ని కూడా ప్రభుత్వమే చెల్లించేది.

క్లుప్తంగా

సీనియర్ సిటిజన్ల చట్టాలను పటిష్టంగా అమలుచేయాలి



తెనాలి: తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం–2007తో పాటు సీనియర్ సిటిజన్స్ ప్రాణ ఆస్తి సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను పటిష్టంగా అమలుచేయాలని కోరుతూ ది తెనాలి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సీనియర్ సిటిజన్స్ జాతీయ కోరికల దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సీనియర్ సిటిజన్స్‌పై ముఖ్యంగా ఒంటరి వృద్ధులపై జరుగుతున్న వేధింపులు, దోపిడీలు, హత్యలు, మోసాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. అనంతరం తెనాలి డీఎస్పీ కార్యాలయంలోనూ వినతిపత్రాన్ని అందజేశారు. సంఘ అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు, కార్యదర్శి కె.నాగేశ్వరరావు, పావులూరి రాంబాబు, ఆర్.భుజంగరావు, పి.మల్లికార్జునరావు, ఎం.అర్జున్, బోస్, ఆర్.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

స్పందించి.. ఆవాసం కల్పించి



సాక్షి ఎఫెక్ట్

తెనాలి, తెనాలి రూరల్: ఓ 'అభాగ్యురాలికి రోడ్డే ఆవాసం' శీర్షికన ఈనెల 15వ తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. మతిస్థిమితం లేని ఒంటరి యువతి రేయింబవళ్లు రోడ్లపైనే తిరుగాడుతున్న వైనం .. ఏదైనా అనుకోనిది జరిగితే కలిగే అనర్థంపై హెచ్చరికతో వచ్చిన కథనంపై తెనాలి మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ స్పందించారు. సోమవారం ఆ యువతి ఎక్కడున్నదీ గుర్తించి గంటల వ్యవధిలోనే జేఎంజే యాజమాన్యంలోని స్వధార్ హోమ్‌నకు తరలించారు. ఆమె దుస్థితిని ప్రచురించిన 'సాక్షి'కి, సమాచారమిచ్చిన స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు తన్నీరు శివశంకర్‌కు, స్పందించిన తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు.

నాగేశ్వరరావుకు కవి సత్కారం



తెనాలి: విజయవాడలోని ఐఎంఏ హాలులో జరిగిన విశ్వసాహితీ కళావేదిక ఆవిర్భావ సభలో జాతీయస్థాయి శతాధిక కవి సమ్మేళనంలో తెనాలికి చెందిన కవి, రచయిత, ఆర్టీసీ కండక్టర్ ఆళ్ల నాగేశ్వరరావుకు ఆదివారం సత్కారం నిర్వహించారు. 'కృత్రిమ కన్నీరు' అనే వచన కవితను గానం చేసినందుకు ఈ గౌరవం దక్కిందని ఆయన పేర్కొన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్, ప్రముఖ సాహితీవేత్త, విమర్శకుడు జీవీ పూర్ణచంద్, విశ్వసాహితీ కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు కొల్లి రమావతి, సంస్థ గౌరవాధ్యక్షుడు రంగిశెట్టి రమేష్‌లు దుశ్శాలువ, జ్ఞాపిక, ప్రశంసాపత్రంను ఆయనకు బహూకరించి ఘనంగా సత్కరించారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు

కృష్ణ మందిరాల వద్ద భక్తులకు అన్నదానం



తెనాలి టౌన్: జన్మాష్టమి వేడుకలు పట్టణ, పరిసర గ్రామాల్లో వాడవాడల ఘనంగా ముగిశాయి. కృష్ణ మందిరాల వద్ద సోమవారం భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. భక్తిశ్రద్ధలతో మహిళలు, పిల్లలు దేవాలయాలకు వచ్చి స్వామిని దర్శించి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాదాలను స్వీకరించారు. కృష్ణాష్టమి సందర్భంగా మందిరాల వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు బచ్చనబోయిన శ్రీనివాసరావు, బీసీ నాయకులు మేడిబోయిన గంగాయాదవ్ పాల్గొని ప్రజలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బచ్చనబోయిన వెంకటేశ్వర్లు, బచ్చనబోయిన కృష్ణ, తాడిబోయిన ప్రవీణ్, గద్దె ఏడుకొండలు, చట్టు శ్రీనివాసరావు, యలమంద, గడవర్తి రాజేష్, ఐజాక్, తదితరులు పాల్గొన్నారు.

గరుడ స్తంభం మండపం ఏర్పాటు



కొల్లిపర: కొల్లిపర గ్రామంలోని శ్రీ జనార్ధన స్వామి వారి దేవాలయం ఎదురుగా ఉన్న గరుడ స్తంభం పైమండపం కొన్ని రోజుల కిందట విచ్ఛిన్నమైంది. దీంతో వేద పండితుల సమక్షంలో సోమవారం వేద మంత్రాల మధ్య నూతన మండపం పునఃనిర్మాణం స్థాపించారు. ఈ సందర్భంగా గ్రామంలోని భక్తులు గరుడ స్తంభం పైమండపంలో ఉన్న గరుత్మంతుడిని దర్శించి తరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో రూ.30 వేలు జరిమానా

తాడికొండ: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుకున్న ముగ్గురు వాహనదారులకు కోర్టులో రూ.30 వేలు ఫైన్ విధించినట్లు తాడికొండ సీఐ కె.వాసు ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం రాత్రి ముగ్గురు మందుబాబులను పట్టుకొని కోర్టులో ప్రవేశపెట్టగా ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున రూ.30 వేలు జరిమానా విధిస్తూ మంగళగిరి కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన తెలిపారు. బహిరంగంగా మద్యం తాగడం, మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

పంటల నష్టం ఎకరాకు రూ.10 వేలు చెల్లించాలి

విత్తనాలు, ఎరువులు ఉచితంగా ఇవ్వాలని రైతుల వినతి

తెనాలి: అధిక వర్షాల కారణంగా నష్టపోయిన పంట పొలాలను వెంటనే ఎన్యూమరేట్ చేసి, ఎకరాకు రూ.10 వేలు పరిహారం, ఉచితంగా విత్తనాలు, ఎరువులు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. రైతులతో కలిసి సంఘ నాయకులు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పరిపాలన అధికారి శ్రీధర్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. గత 12వ తేదీన కురిసిన భారీ వర్షం కారణంగా తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల, చేబ్రోలు మండలాల్లోని రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని.. రెండోసారి వెదజల్లిన వరి కూడా అధిక వర్షానికి నీట మునిగిందని.. పసుపు, కూరగాయలు, ఆకుకూరలకు నష్టం వాటిల్లిందని గుర్తుచేశారు. రైతు సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. సీపీఎం తెనాలి కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ మాట్లాడుతూ.. సాగుభూమి రీలోకలైజేషన్‌ను చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.భావనారాయణ, షేక్ హుస్సేన్ వలి, రైతులు కళ్లం శ్రీనివాసరెడ్డి, ఎస్.సుబ్రహ్మణ్యం, తమ్మా శివరాం, అక్కల వెంకటేశ్వరరావు, రవి కిషోర్, గుంపెన రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.


సబ్ కలెక్టర్ కార్యాలయంలో అర్జీ ఇస్తున్న రైతులు

రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడాలి

తెనాలి అర్బన్: రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు ఆదేశించారు. టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ రోడ్డులో సోమవారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వాహణ పనులను పరిశీలించి పలు సిబ్బందికి సూచనలు చేశారు. రోజూ కాలువలను కూడా బాగు చేయాలని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

తెనాలి అర్బన్: ఐతానగర్ బ్యాంకర్స్ కాలనీలో మురుగు కాలువల నిర్మాణం కోసం మూడేళ్ల క్రితం నిధులు మంజూరు చేశారని.. కానీ నేటికీ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదని.. పనులు ప్రారంభించే విధంగా చూడాలని ఆ ప్రాంత వాసులు మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావును కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. మంచినీటి కుళాయి కనెక్షన్లు, పిచ్చిచెట్లు, ముళ్ల కంపలు తొలగించాలని, ఆగిపోయిన పెన్షన్ పునఃరుద్ధరించాలని, ఆక్రమణలు తొలగించాలని పలువురు వినతిపత్రాలు ఇచ్చారు. వీటన్నింటినీ పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ విల్సన్ జయకర్, ఏసీపీ వాణి, ఎంఈ శ్రీకాంత్, పలువురు అధికారులు పాల్గొన్నారు.


పనులను పర్యవేక్షిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ లక్ష్మీపతిరావు

- పట్టణంలోని కాంట్రాక్టర్లతో సోమవారం కమిషనర్ ఛాంబర్‌లో లక్ష్మీపతిరావు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. కాంట్రాక్టర్ల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. సమావేశంలో డీఈలు ఆకుల శ్రీనివాసరావు, శ్రీనివాసులు, శ్రీనివాసరావు, ఏఈలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

దుగ్గిరాల ఎస్టీవోపై చర్యలు తీసుకోవాలి

జిల్లా ఖజానాధికారికి ఫిర్యాదు చేసిన యూటీఎఫ్ బృందం

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన వేతనాల బిల్లులను పెండింగ్‌లో ఉంచి వేధింపులకు గురి చేస్తున్న దుగ్గిరాల ఉప ఖజానాధికారి(ఎస్టీఓ)పై చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా ఖజానాధికారి కార్యాలయంలో డీటీఓ చంద్రశేఖర్‌రెడ్డిని కలిసిన యూటీఎఫ్ ప్రతినిధులు బృందం దుగ్గిరాల ఎస్టీఓపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఎస్టీఓ అశ్విని ప్రతి నెలా వేతన బిల్లులను మంజూరు చేయకుండా కొర్రీలు వేసి తిప్పి పంపుతున్నారని ఆరోపించారు. అవసరం లేని జీఓలను డిమాండ్ చేస్తున్నారని, దీని అర్థం ఏమిటో చెప్పాలన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులకు రెండు నెలలుగా వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతుండగా, దుగ్గిరాల ఎస్టీఓ పరిధిలోని దుగ్గిరాల, కొల్లిపర మండల ఉపాధ్యాయుల బిల్లులను పాస్ చేయకుండా నిలిపివేయడం వేధింపులుగా పరిగణించాల్సి వస్తుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే తాను మంత్రి తాలూకా అని, నన్నేమీ చేయలేరని ఉద్యోగ, ఉపాధ్యాయులపై బెదిరింపులకు దిగుతున్నారని డీటీఓ దృష్టికి తెచ్చారు. పదేళ్ల క్రితం హెచ్‌ఆర్‌ఏ మారి వేతనాలు పొందుతున్న గ్రామాల్లోని పాఠశాలల్లో ఖాళీలను కోరుకుని వచ్చిన ఉపాధ్యాయులను సంబంధిత జీవోలు తెచ్చి ఇవ్వాలంటూ వేతనాలు చెల్లించకుండా తిప్పించుకుంటున్నారని తెలిపారు. తక్షణమే జిల్లా అధికారులు జోక్యం చేసుకుని వేతనాల చెల్లింపునకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. డీటీఓను కలిసిన వారిలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, ఎం.గోవిందు, జి.వెంకటేశ్వరరావు, ఏ.శ్రీనివాసరావు, బి.ప్రసాదు, ఎం.కోటిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు రెహమాన్, చంద్రశేఖర్, శివపూర్ణయ్య, ధనరాజు, భాస్కర్ ఉన్నారు.

ఆయిల్ బాల్స్‌తో లార్వా నిర్మూలన

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్, వేములూరిపాడు గ్రామాల్లో మురుగునీరు నిలిచిన ప్రాంతాల్లో సోమవారం పంచాయతీ సిబ్బందిచే ఎంఎల్ ఆయిల్ బాల్స్ వేయించినట్లు ఎంపీహెచ్‌ఏ బాబురావు అన్నారు. పంచాయతీ సిబ్బందిచే బీసీ కాలనీ, అమీనాబాద్ ప్రాంతంలోని వర్షం నీరు నిలిచిన పలు ప్రాంతాలల్లో ఎంఎల్ ఆయిల్ బాల్స్ వేస్తున్న తీరును పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న, ఎంఎల్‌హెచ్‌పి బాబురావులు పరిశీలించారు. ఎంఎల్ ఆయిల్‌లో ఊకతో చేసిన బంతులను 5 రోజుల పాటు నానబెట్టి వాటిని నీటి కుంటల్లో వేస్తున్నట్లు చెప్పారు. దీంతో దోమల లార్వా పూర్తిగా నిర్మూలించబడి, దోమల వృద్ధి తగ్గుతుందన్నారు. పదిరోజుల పాటు ఎంఎల్ ఆయిల్ ప్రభావం ఉంటుందని చెప్పారు.



పూలింగ్ పేరుతో రైతులను మోసం చేస్తే సహించం

ఏఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కోటేశ్వరరావు

తాడికొండ: పూలింగ్ పేరుతో రాజధాని రైతులను మోసం చేసేందుకు కూటమి ప్రభుత్వం యత్నిస్తే అడ్డుకుంటామని ఆంధ్ర రాష్ట్ర సమితి అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు అన్నారు. కూటమి ప్రభుత్వం అదనపు పూలింగ్ పేరుతో చేస్తున్న యత్నాన్ని నిరసిస్తూ మండలంలోని నిడుముక్కల గ్రామంలో కొనసాగుతున్న రిలే నిరసన దీక్షలు సోమవారంతో 50వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇక్కడ భూములు తీసుకొని విదేశాలకు ఎక్కువ ధరలకు అమ్ముకునేందుకు కూటమి ప్రభుత్వం ఇప్పటికే డీల్ ఫిక్స్ చేసిందని, తాము నిరసన తెలపడం, రైతులు అడ్డం తిరగడంతో తాత్కాలికంగా వాయిదా వేసిందన్నారు. గతంలో 4 సంవత్సరాలు ఉద్యమం చేసి అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు తాను 4 ఏళ్లు ఉద్యమం చేసి వారిని 4 సీట్లకే పరిమితం చేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. మొదటి దశ పూలింగ్‌లో భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేయకుండా మళ్లీ పూలింగ్ ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్ణయం ఉపసంహరించుకునే వరకు తమ నిరసన దీక్షలు విరమించేది లేదని, రైతుల కోసం ముందుకు నడుస్తానన్నారు. కార్యక్రమంలో రైతులు, మహిళలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

స్థలం ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

డీఎస్పీకి బాధితుడి ఫిర్యాదు

తెనాలి రూరల్: తమ స్థలాన్ని ఇతరులు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని.. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన సమస్య పరిష్కారం కాలేదని బాధితుడు తెనాలి డీఎస్పీకి సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. మండలంలోని మల్లెపాడు గ్రామానికి చెందిన పినపాటి సునీల్‌పాల్ తమకు తన తండ్రి ద్వారా వచ్చిన 25 సెంట్ల స్థలాన్ని అదే గ్రామానికి చెందిన పినపాటి నాగేశ్వరరావు, పినపాటి కోటేశ్వరరావు ఆక్రమించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే ఐతాగర్ నుంచి బయటి వ్యక్తులను తీసుకు వచ్చి దాడి చేసేందుకు ప్రయత్నిస్తున్నారని సునీల్‌పాల్ ఆరోపించారు. స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని ఆయన డీఎస్పీని కోరారు.

పీఏసీఎస్ అధ్యక్షుల ప్రమాణ స్వీకారం

మంగళగిరి: రైతుల సంక్షేమానికి వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాలు కృషి చేసేందుకు చర్యలు తీసుకుంటామని పీఏసీఎస్ అధ్యక్షుడు తెలిపారు. సోమవారం మంగళగిరి, నూతక్కి నూతన వ్యవసాయ సహకార సంఘాల ప్రమాణస్వీకారం మంగళగిరి మార్కెట్‌యార్డు ఆవరణలో నిర్వహించారు. మంగళగిరి సహకార సంఘం అధ్యక్షుడిగా గాదె పిచ్చిరెడ్డి, సభ్యులుగా వాసా వేణుకుమార్, అందె శివశంకరరావు, నూతక్కి సహకార సంఘం అధ్యక్షుడిగా వల్లూరి వెంకటేశ్వరరావు ప్రమాణస్వీకారం చేశారు. నూతన పాలక వర్గాలను అభినందించిన మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ జువ్వాది కిరణ్ చందుతో పాటు పలువురు టీడీపీ నాయకులు మాట్లాడుతూ వ్యవసాయ సహకార సంఘాలను మరింత బలోపేతం చేసి రైతుల సంక్షేమానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, మంగళగిరి వైస్ చైర్మన్ యర్రగుంట్ల భాగ్యారావు, రాష్ట్ర పద్మశాలీయ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్యం అందించడంలో ఆర్‌ఎంపీల పాత్ర ముఖ్యమైనది

మంగళగిరి టౌన్: గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యం అందించడంలో ఆర్‌ఎంపీ, పీఎంపీల పాత్ర చాలా ముఖ్యమైనదని విజయవాడ వేదాంత హాస్పిటల్ అధినేత డాక్టర్ సందీప్‌కుమార్ పేర్కొన్నారు. మంగళగిరి నగర పరిధిలోని రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ సర్వ సభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సందీప్‌కుమార్ మాట్లాడుతూ రాత్రి సమయంలో అయినా ఫోన్ చేయగానే ప్రజలకు సేవలు అందిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వచ్చిన ఆధునిక చికిత్స విధానంపై ఆర్‌ఎంపీలు, పీఎంపీలకు వివరించారు. అనంతరం ఆర్‌ఎంపీలు, పీఎంపీలు అధ్యయన తరగతుల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్ తోపాటు 100 మందికి పైగా ఆర్‌ఎంపీలు, పీఎంపీలు పాల్గొన్నారు.



అసోసియేషన్ సమావేశంలో ఆర్‌ఎంపీలు, పీఎంపీలు

విద్యా దాతల విగ్రహాల ఆవిష్కరణ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లిలో నిర్మించిన గాదె రామయ్య, సీతారావమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్థలం కేటాయించారు. దానికి గుర్తింపుగా వారి విగ్రహాలను ఏర్పాటు చేసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గాదె రామయ్య, సీతారావమ్మల కుమారుడు గాదె సోమశేఖరరావు, కుమార్తె చాముండేశ్వరిదేవి, గాదె భావన్నారాయణ, కుటుంబ సభ్యులు విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉండవల్లిలో పాఠశాల నిర్మాణం కోసం సుమారు రూ.10 కోట్ల విలువైన భూమిని ఇచ్చిన విద్యాదాతలు రామయ్య దంపతులని పేర్కొన్నారు. గతంలో ఉండవల్లిలో పాఠశాల లేకపోవడంతో విద్యార్థులు పెనుమాక వెళ్లాల్సి వచ్చేదని, విద్య కోసం వారు పడుతున్న ఇబ్బందులను గమనించి, 1978లో భూదానం ఇవ్వడంతో పాటు పాఠశాల భవనాన్ని నిర్మించి ఇచ్చారని తెలిపారు. పాఠశాల భవన నిర్మాణంలో విశిష్ట సేవలందించిన శ్రీరామచంద్రమూర్తి (జై ఆంధ్రా మాష్టారు)ని స్మరించుకుంటూ వారి పిల్లలు భానుమతి, జనార్ధన్, విక్రమ్‌ను గాదె కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరోజని, ఆంజనేయులు, భారతీరాజా తదితరులు పాల్గొన్నారు.


విగ్రహాలను ఆవిష్కరించి, మాట్లాడుతున్న గాదె కుటుంబ సభ్యులు

ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

ఏవో ఆర్.విజయబాబు

దుగ్గిరాల: మండలంలోని రైతులకు ఇప్పటివరకు ప్రభుత్వ సొసైటీలు, ప్రైవేటు దుకాణాల ద్వారా 782 మెట్రిక్ టన్నుల ఎరువులను పంపిణీ చేశామని ఏవో ఆర్.విజయబాబు తెలిపారు. సోమవారం దుగ్గిరాల వ్యవసాయ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఖరీఫ్ వరి సాగు 20 వేల ఎకరాలలో సాగవుతున్నదని, వర్షాభావ పరిస్థితుల కారణంగా ఆలస్యంగా వరి వేశారని అన్నారు. 19వ తేదీకి సొసైటీలకు 80 మెట్రిక్ టన్నుల యూరియా, 100 మెట్రిక్ టన్నుల డీఏపీ, రైతు సేవా కేంద్రాలకు 46 మెట్రిక్ టన్నుల యూరియా, 15 మెట్రిక్ టన్నుల డీఏపీ అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రైవేటు డీలర్లు అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే లైసెన్సు రద్దు చేస్తామని, కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు అవసరం మేరకే ఎరువులు కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

